Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699


అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 251 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 19 - 5 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# వేటకు విరామం... సర్కారు సాయం

**- గంగపుత్రులకు రెండో ఏడాది అండగా ప్రజా ప్రభుత్వం - 'మత్స్యకారుల సేవలో' కింద ప్రతీ కుటుంబానికి రూ.20 వేలు జమ - 1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్లు లబ్ది - కావలిలో నేడు నిధులు విడుదల కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌లోని మత్స్యకారుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వేట నిషేధ కాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా మత్స్యకారులను ఆదుకునేందుకు అమలు చేస్తోన్న 'మత్స్యకారుల సేవలో' పథకం కింద వరుసగా రెండో ఏడాది ఆర్థిక సాయం అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ. 262 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయనుంది. నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు విడుదల చేయనున్నారు. ప్రతీ ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు... 61 రోజుల పాటు సముద్రంలో చేపలు పిల్లలు పెట్టే సమయంలో వేటకు విరామం ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారుల జీవనానికి ఇబ్బంది లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి రూ. 20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది.

**రెండేళ్లలోనే రూ.505 కోట్ల సాయం**

వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 20 వేలు ఆర్థిక సాయం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. హామీ ఇచ్చినట్టుగానే గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ. 243 కోట్లు సాయం అందించగా... ఈ ఏడాది 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ. 262 కోట్ల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. ఈ ఏడాది లబ్ధిదారు కుటుంబాల సంఖ్య కూడా పెరిగింది. రెండేళ్లలోనే మత్స్యకారుల కుటుంబాలకు వేట నిషేధ సమయంలో రూ. 505 కోట్లను సాయంగా అందించింది. గత ప్రభుత్వం మత్స్యకారులకు కేవలం రూ. 10 వేల సాయాన్ని మాత్రమే అందించింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ బలహీన వర్గాల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ సాయాన్ని రూ. 20,000 పెంచుతూ ప్రజా ప్రభుత్వం బాసటగా నిలిచింది. వరుసగా రెండో ఏడాది ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను పెంచి నిధులు విడుదల చేయడం ద్వారా మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతోంది.

**సకాలంలో పరిహారం... కుటుంబాలకు సహకారం**

వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వేట సమయంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు పరిహారం సకాలంలోనే అందిస్తోంది. 2024-25లో 63 క్లెయిమ్స్‌కు రూ. 3.15 కోట్లు, 2025-26లో 113 పెండింగ్ క్లెయిమ్స్‌కు రూ. 5.65 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. అంతేకాకుండా వారి ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం సీవీడ్ సాగును ప్రోత్సహిస్తోంది.

# శేషాచలం అటవీ సంపద కాపాడటంలో టీటీడీ కృషి కొనసాగాలి : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** తిరుమలలో 89.4 శాతం అటవీ విస్తీర్ణం సాధించిన తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. శేషాచలం అడవుల్లో స్థానిక జాతుల పునరుద్ధరణకు టీటీడీ కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. అటవీ సంపద పరిరక్షణకు చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రకృతిని పవిత్రంగా భావించడం భారతీయ సంప్రదాయమని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ దైవసేవతో సమానమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన తిరుమల అందించాలనే లక్ష్యంతో టీటీడీ చర్యలు చేపట్టిందని తెలిపారు. తిరుమల పర్యావరణ పరిరక్షణలో టీటీడీ చేస్తున్న కృషి అమోఘమని ప్రశంసించారు. శేషాచలం అటవీ సంపద కాపాడటంలో టీటీడీ నిరంతర చర్యలు కొనసాగాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.




# సామాజిక చైతన్యానికి ప్రతీక కీ.శే.వీర్ల గోపాలకృష్ణమూర్తి

**- బీపీ మండల్ సేన అధ్యక్షులు డాక్టర్ అలా వెంకటేశ్వర్లు**

**గుడివాడ, (రాజధాని వార్తలు):** సామాజిక నిబద్ధత, కుటుంబ విలువలు, ప్రజాసేవ భావనకు ప్రతీకగా ఉన్నత విలువలతో జీవనం కొనసాగించిన వీర్ల గోపాల కృష్ణమూర్తి స్ఫూర్తి దాయకులని బీపీ మండల్ సేన అధ్యక్షులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు యాదవ్ పేర్కొన్నారు. విశ్రాంతి ఐఏఎస్ అధికారిణి బి ఉదయలక్ష్మి, గుంటూరు జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి వీర్ల జ్యోతిబోస్ తండ్రి, విశ్రాంతి ఐపిఎస్ అధికారి బి రమణ కుమార్, సీనియర్ న్యాయమూర్తి "దివంగత" కొలుసు ప్రసాద్‌ల మామ అయినా దివంగత వీర్ల గోపాలకృష్ణమూర్తి "సంస్మరణ సభ" పెదపారుపూడి మండలం వింజరంపాడు గ్రామంలో అద్యంతం భావోద్వేగభరితంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు అధికారులు, అనధికారులు, బి.సి., యాదవ సంఘాల నాయకులు పాల్గొని దివంగత వీర్ల గోపాలకృష్ణమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆలా మాట్లాడుతూ సమాజ అభ్యున్నతికి కట్టుబడి పని చేసే వ్యక్తుల స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకమవుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురి ప్రముఖులతో పాటు ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ గోపాల కృష్ణమూర్తి విలువలతో జీవించిన వ్యక్తిత్వమని, ఆయన జీవన విధానం నేటి తరానికి ఆదర్శనీయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థలో పరస్పర గౌరవం, సామాజిక బాధ్యత, ప్రజల పట్ల మానవీయ దృక్పథం వంటి అంశాలను ఆయన జీవితాంతం ఆచరించారని శ్రీరామ్ తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సమాజంలో అందరితో ఆత్మీయ సంబంధాలు కలిగి ఉన్న మహనీయుడు గోపాలకృష్ణ మూర్తి అని పేర్కొన్నారు. యాదవ ఉద్యోగుల సంఘం నాయకులు దాసరి శివకుమార్ యాదవ్, హైకోర్టు డిప్యూటీ రిజిస్టర్ పల్లా వినోద్ కుమార్, జడ్పిటిసి మాజీ సభ్యులు జూనేబోయిన శివ యాదవ్, అఖిల భారత యాదవ మహా సంఘం రాష్ట్ర నాయకులు గోరిపర్తి శ్రీనివాస్ యాదవ్, వీర్ల నాని, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌరిపర్తి సాంబశివరావు యాదవ్, తేజ గురునాథ్ బాబు యాదవ్ తదితరులు మాట్లాడుతూ యాదవ జాతి గర్వపడే విధంగా, స్ఫూర్తి దాయకంగా ఆణిముత్యాలు లాంటి సంతానాన్ని సమాజానికి అందజేసిన గోపాలకృష్ణమూర్తి యాదవ్ ధన్యుడని పేర్కొన్నారు. ఈ సంస్మరణ కార్యక్రమం ద్వారా గోపాలకృష్ణమూర్తి జీవిత ప్రయాణం ఆయన అందించిన మానవీయ విలువలు మరోసారి గుర్తు చేసినట్లు అయ్యింది. కుటుంబ సభ్యులు సహితులు సామాజికవేత్తలు యాదవ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై గోపాలకృష్ణమూర్తికి ఘన నివాళులర్పించారు.



## 'జన్ జీ' కౌంటర్



బంగారం కొనవద్దంటూ
మోదీజీ శాసనం
మరి గడిచేదెలా పసిడి
కార్మికుల జీవనం!


సైకిల్ సవారీయే మేలంటూ
ఒక మంత్రివర్యుల నినాదం
చెప్పిన ఒక గంటలోనే
మరో మంత్రి ఎక్కెను విమానం

-కలిమిశ్రీ

# బాధాకరమే కానీ ముఖ్యమంత్రి మాటే శిరోధార్యం

**- జిల్లాలో వర్చువల్‌గా మహానాడు - సీఎం అడుగుజాడల్లో నడుద్దాం - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి - హైబ్రిడ్ పద్ధతిలో మహానాడు నిర్వహించబోతున్నాం - ఎన్టీఆర్ భవన్ నుండి వర్చువల్‌గా మహానాడు - రాష్ట్ర అభివృద్దే లక్ష్యం సిఎం నిర్ణయం - ప్రధాని మోదీ సూచనల మేరకు దేశవ్యాప్తంగా పొదుపు చర్యలు - రాష్ట్ర వ్యాప్తంగా 1845 క్లస్టర్ల ద్వారా మహానాడు - మహానాడును తమ బాధ్యతగా బావించి కష్టపడ్డ నాయకులందరికీ ధన్యవాదాలు - రాబోవు రోజుల్లో సీఎంను కోవూరుకు తీసుకు వస్తాం - మీడియా సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ సూచనల మేరకు దేశవ్యాప్తంగా పొదుపు చర్యలు చేపట్టాలి అనే ఒక్కో ఒక్క ఉద్దేశంతో ప్రధాని అడుగు జాడల్లో నడుస్తున్నటు వంటి మన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబు నాయుడు ముందుకు వచ్చారని, మన రాష్ట్రం నుంచే పొదుపు ఉద్యమం మొదలు అవ్వాలి అనే ఆలోచన చాలా గొప్పదిని కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరు నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో కాని రాష్ట్రంలో కాని సంక్షోభం ఏర్పడుతుందని ఆలోచన వస్తే ఆ సంక్షోభం నుండి రాష్ట్రాన్ని కాపాడుకునే పరిస్థితిలో ప్రజల యొక్క సంక్షేమాన్ని కోరి, మొట్ట మొదటిగా స్పందించే వ్యక్తి నారా చంద్రబాబు నాయుడుని, ఆ పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ప్రస్తుత తరుణంలో దేశంలో జరుగుతున్న అనేక పరిస్థితులను రాబోయే సంక్షోభాన్ని గుర్తించిన ప్రధాని నరేంద్ర మోడీ ముందస్తుగా ప్రజా ప్రయోజనాల కోసం దేశ అభివృద్ధి కోసం తీసుకున్న ముందుస్తు పొదుపు చర్యలు చేయాలి అనే ఆలోచనా విధానం మన దేశానికి ఎంతగానో ఉపయోగం అన్నారు. మన రాష్ట్ర ఉపయోగాలను మన రాష్ట్ర అభివృదే



లక్ష్యంగా పనిచేసే మన సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడు దేశానికి ఆదర్శంగా నిలవటంలో ముందుంటారు అని ఈ సందర్భంగాతెలియజేసారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం అనేక విషయాలని దృష్టిలో పెట్టుకొని పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహానాడు కార్యక్రమాన్ని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో వర్చువల్‌గా చేయాలి అని నిర్ణయం తీసుకోవటం ముఖ్యమంత్రి దార్శనికత స్పష్టంగా తెలియజేస్తుం దన్నారు. చెప్పడమే కాదు ఆచరించడం కూడా సీఎం గొప్పతనం అన్నారు. నెల్లూరు జిల్లా కొవూరు నియోజకవర్గంలో మహానాడు నిర్వహించాలి అని నిర్ణయం తీసుకున్న తర్వాత పసుపు పండుగ చేసే బాగ్యం మాకు దక్కినందుకు జిల్లా నాయకులు అందరం చాలా సంతోషించామన్నారు. ఐనప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా సీఎం తీసుకున్న నిర్ణయాన్ని తాము అందరం పాటిస్తు న్నామన్నారు..పొదుపు చర్యలో భాగంగా మహానాడును హైబ్రిడ్ పద్ధతిలో పొదుపు మహానాడుగా జరపాలని మన తెలుగుదేశం పార్టీ అధినేత గౌరవనీయులు చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల మైన తాము అంతా ఏకీభవి స్తున్నామన్నారు. నెల్లూరులో మూడు రోజులు నిర్వహించ తలపె ట్టిన మహానాడు స్థానంలో మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాల యంలో ఈ నెల 27, 28 తేదీల్లో మహానాడు హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహించుకోబోతున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భవన్లో స్టేజ్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 1845 క్లస్టర్లలో స్క్రీన్‌లు ఏర్పాటు చేసుకొని మహానాడును పొదుపు మహానాడుగా నిర్వహించుకోబోతున్నామన్నారు. ఎన్టీఆర్ భవన్ నుండి పొలిట్ బ్యూరో సభ్యులు అలాగే నియోజకవర్గం నుంచి ఆన్లైన్ విధానంలో మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు మహానాడు కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేసుకుంటున్నామన్నారు. తీర్మానాలతో సహా ఇతర అన్ని అంశాల్లోనూ మహానాడు విధానాలను పాటిస్తూ నిర్వహించుకోబో తున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, కుటుంబ సభ్యులు అందరూ అధిష్టానం సూచనల మేరకు మహా నాడులో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించాలి అని చెప్పిన గత 15 రోజుల నుండి నెల్లూరు జిల్లా నాయకులు, కార్యకర్తలు కోవూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరూ తమ బాధ్యతగా బావించి నిరంతరం కష్టపడి పని చేసిన అం దరికీ ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. మహానాడు నిర్వహణకు జాతీయ తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంటు యువనాయకులు నారా లోకేష్ ఎప్పుడు అవకాశం కల్పించిన మేము అందరం సంసిద్ధంగా ఉంటాము అని తెలియ జేసుకుంటున్నామన్నారు.

మహానాడు కోవూరులో నిర్వహించు కుంటున్నామని నియోజక వర్గ ప్రజలు ఎంతో సంతోషించార న్నారు. రాబోవు రోజుల్లో సీఎం చంద్రబాబు నాయుడుని కోవూరుకు తీసుకు వస్తామన్నారు. అదేవిధంగా కోవూరు నియోజ కవర్గ అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తామన్నారు.

## మెరుగైన వైద్యం కోసం బాధితులకు రూ. 11 లక్షల 48 వేల విలువైన ఎల్ ఓ సి పత్రాలు అందజేత



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యం తో మంజూరైన (లేటర్ ఆఫ్ క్రెడిట్) ఎల్ ఓ సీలను కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వాణిజ్య విభాగం కన్వీనర్ పచ్చిపులుసు వెంకట శివప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ వైస్ ప్రెసిడెంట్ నున్న కృష్ణ, 42వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బెన్నా భక్తుల సోమేశ్వరరావు, జనసేన పార్టీ 39 వ డివిజన్ అధ్యక్షుడు ఏలూరు సాయి శరత్, బీజేపీ కొత్తపేట మండల అధ్యక్షులు బైపిళ్ళ చందు ఎన్డీఏ కార్యాలయంలో అందజేశారు. 39 వ డివిజన్‌కు చెందిన గోర్తి శ్రీనివాస్ (62) కిడ్నీ స్టోన్స్ సమస్యతో బాధ పడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేయగా మంజూరైన రూ. 1 లక్ష 91 వేల ఎల్‌ఓసీను అందజే శారు. 42వ డివిజన్, హెచ్‌బీ కాలనీకు చెందిన ఉత్తరవల్లి కోటేశ్వరరావు (47) రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శస్త్ర చికిత్స కొరకు వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ. 4 లక్షల 37 వేల ఎల్ ఓ సీను అందజేశారు. అదేవిధంగా హెర్నియాతో బాధపడుతున్న 52 వ డివిజన్‌కు చెందిన పిళ్ళ మధుసూదన్ (49) కు రూ 2 లక్షల 60 వేల ఎల్ ఓ సీను, 38 వ డివిజన్ కుమ్మరి పాలెంకు చెందిన షేక్ మాలిన్ ప్రాంక్రియాస్ తో బాధపడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 2 లక్షల 60 వేల ఎల్ ఓ సీ పత్రాలను అందజేశారు. త్వరితగతిన స్పందించి (లెటర్ ఆఫ్ క్రెడిట్) ఎల్ ఓ సి పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## విశాఖ కెజిహెచ్‌లో 3.32 కోట్లతో హీమోగ్లోబినోపతీల కోసం సెంటర్ ఆఫ్ కంపిటెన్స్ ప్రారంభించిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి









**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత అత్యాధునిక పరికరాలతో విశాఖ కెజిహెచ్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు – మంత్రి. సికిల్ సెల్ వ్యాధి నివారణకు ఆధునిక వైద్య నవజాత శిశువులు, గర్భిణీలకు ప్రత్యేక స్క్రీనింగ్ సేవలు అందుబాటులోకి గిరిజన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతాం – మంత్రి గుమ్మిడి సంధ్యారాణి. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గిరిజన ఆరోగ్య రంగ బలోపేతం జన్యు కౌన్సెలింగ్, రక్త మార్పిడి సేవలు సిఓసి ద్వారా అందుబాటులోకి 2047 నాటికి సికిల్ సెల్ అనీమియా నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం కృషి – మంత్రి. ఆంధ్రప్రదేశ్‌లో సికిల్ సెల్ స్క్రీనింగ్ కార్యక్రమంలో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించింది – మంత్రి. మొత్తం లక్ష్య జనాభా 17,11,164 మందిలో ఇప్పటికే 15,21,294 మంది నమోదు – మంత్రి. రాష్ట్ర వ్యాప్తంగా 14,95,355 మందికి సికిల్ సెల్ స్క్రీనింగ్ పూర్తి చేశాం – మంత్రి. స్క్రీనింగ్‌లో 21,767 మంది క్యారియర్‌లను గుర్తించాం – మంత్రి. 2,285 మంది సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నాం – మంత్రి. రాష్ట్రంలో ఇప్పటికే 4.85 లక్షల కార్డులు పంపిణీ చేశాం – మంత్రి. గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ వ్యాధి ముందస్తు గుర్తింపుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు – మంత్రి. ప్రతి గిరిజన కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం – మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరం

**- అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ హిమాన్షు శుక్ల**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల భవిష్య త్తులో తీవ్ర పర్యావరణ, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, ప్లాస్టిక్‌రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వా ములు కావాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. శనివారం ఉదయం "స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరంలోని వి.ఆర్.సి గ్రౌండ్ వద్ద ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని మున్సిపల్ కమిషనర్ నందన్ తో కలిసి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రారంభించారు. వి.ఆర్.సి గ్రౌండ్ నుంచి గాంధీ బొమ్మ సర్కిల్ వరకు సాగిన ఈ ర్యాలీలో అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని ప్లాస్టిక్ నిషే ధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. "ప్లాస్టిక్‌ను అరికట్టాలి", "పర్యావరణాన్ని కాపాడాలి" వంటి నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా ఈ నెల థీమ్‌గా "ప్లాస్టిక్ ఫ్రీ స్టేట్"ను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, పర్యావరణ హిత ప్రత్యామ్నాయాల వినియో గాన్ని ప్రోత్సహించడమే ఈ థీమ్ లక్ష్యంగా చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు సంభవిస్తున్నాయని, భవిష్యత్తులో ఇది పెను ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉం దన్నారు. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా ప్లాస్టిక్ ఒక కారణమవుతోందని తెలిపారు. ప్రజలందరూ ప్లాస్టిక్ నివార ణలో భాగస్వాములై, ఇరుగుపొరుగు వారికీ అవగా హన కల్పించా లని సూచించారు. ప్లాస్టిక్ నియంత్రణ కోసం ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని, ప్లాస్టిక్ విక్రయించే దుకాణాలు, తయారీ సంస్థలపై నిరంతర దాడులు నిర్వహిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలను సీజ్ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నందన్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం "స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచి, పూర్తిగా ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా అధికమవుతున్నాయని కమిషనర్ అన్నారు. ప్రజలు క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణను ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి, పరిశుభ్రమైన పర్యావరణహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేసి అందరికీ క్లాత్ సంచులను పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, వి ఆర్ సి వాకర్స్ అసోసియేషన్ నిర్వా హకులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ విజయ్ కుమార్ ట్రస్ట్ వివరాలు ప్రజలకు తెలియజేయాలి : శ్రీనివాసరావు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ విజయకు మార్ మిత్ర మండలికి చెందిన అరిగే శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా సేవలో తరించిన డాక్టర్ విజయ్ కుమార్ హత్యోదంతాన్ని ఎవరు మరవరు, ఆయన స్థాపించిన ట్రస్ట్‌లో భాగమైన డాక్టర్ విజయ్ కుమార్ మెమోరియల్ హాస్పిటల్‌ను ట్రస్ట్ సభ్యులు దుర్వినియోగ పరుస్తున్నారని, ట్రస్ట్ బైలాను బహిర్గతం చేయాలని, ట్రస్టు సభ్యులు ఎంతమంది ఉన్నారు వివరాలు సభ్యుల వివరాలు తెలియజేయాలని, ప్రస్తుత సంబంధించిన జమ ఖర్చులు తెలియ జేయాలని, అలాగే డాక్టర్ విజయకుమార్ రాసిన వీలునామా మార్చబడినది అని ప్రజలలో స్నేహితులలో భావన కలదని కావున పేద ప్రజలకు సేవ చేయడానికి ఏర్పాటు చేసిన డాక్టర్ విజయ్ కుమార్ మెమోరియల్ హాస్పిటల్‌కు చెందిన ఆస్తులు వీలునామా పరిరక్షించాలంటే వాస్తవాలు ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకొని నిజానిజాలను ప్రజలకు తెలియజేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# 47వ డివిజన్‌లో ముమ్మరంగా అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయం

## - కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ






**నెల్లూరు సిటీ, (రాజధాని వార్తలు):** రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సహకారంతో 47వ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి మరియు మౌలిక వస తుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృత పర్యటన జరిపారు. కామాటి వీధి, పోస్ట్ ఆఫీస్ సందు, కొరడా వీధి, గిడ్డంగి వీధి ప్రాంతాల్లో పర్యటించిన కార్పొరేటర్.. స్థానిక ప్రజలు, వ్యాపారస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా ఆయా వీధుల్లోని డ్రైన్‌ల్లో చెత్త పేరుకుపోవడాన్ని గమనించిన ఆయన తక్షణమే స్పందించారు. వెంటనే శానిటేషన్ ఇన్స్పెక్టర్ అశోక్‌ను అక్కడికి పిలిపించి, తన పర్యవేక్షణలోనే సిబ్బందితో డ్రైన్ల క్లీనింగ్ పనులను పూర్తి చేయించారు. అనంతరం కామాటీ వీధిలో ముమ్మరంగా సాగుతున్న రోడ్డు ప్యాచ్ వర్క్ (మరమ్మతు) పనులను కార్పొరేటర్ రామకృష్ణ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

ఈ పర్యటనలో విబిఎస్ ట్రెజరర్ దండపాని సురేష్, యూనిట్ ఇంచార్జ్ రెహమాన్, ట్రెజరర్ బి.చంద్ర, బిఎల్‌సి ఆర్కాట్ శీను, టి.చంద్ర, ఐటీడీపీ జనరల్ సెక్రెటరీ విజయ్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయం చేస్తున్నాయి: కిషన్‌రెడ్డి ధ్వజం



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** సర్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరికి ఒక్క ఓటు ఒక్క దగ్గర మాత్రమే ఉం డాలని చెప్పుకొచ్చారు. ప్రింటింగ్ ఎర్రర్ కారణంగా ఒక్కొక్కరి ఓటు పది ప్రాంతాల్లో చూపిస్తోందని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో సర్ షెడ్యూల్ వచ్చిందని ప్రస్తావించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని తాము తప్పుపట్టడం లేదని అన్నారు. ఓటర్ లిస్టు సరిదిద్దడంలో అందరి బాధ్యత ఉందని తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్ లెవెల్ ఆఫీసర్ ఒక్కో ఇంటికి మూడుసార్లు వెళ్తారని చెప్పారు.

**ఉద్యోగులపై నమ్మకం లేదు..**

రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై నమ్మకం లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ముస్లింల మీటింగ్‌కి వెళ్లి.. మీరంతా ముందుకు రావాలని సీఎంగా ఉండి రేవంత్‌రెడ్డి రెచ్చగొడుతున్నారని విమర్శించారు. సర్ చేసేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులేనని.. బీజేపీ కార్యకర్తలు కాదని స్పష్టం చేశారు. సర్‌లో కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ నేతలు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. సర్‌లో ఎక్కడ కుట్ర జరుగుతుందో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ బాధ్యతారహితంగా మాట్లాడు తున్నాయని ఆగ్రహించారు. కేరళం, తమిళనాడులో బీజేపీ గెలవలేదు కాబట్టి అక్కడ సర్ బాగా జరిగిందని అంటున్నారని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ గెలిచింది కాబట్టి అక్కడ సర్ తప్పు జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

**పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలి..**

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని... ఎలక్షన్ కమిషన్‌పై బురద జల్లవద్దని కిషన్‌రెడ్డి హితవు పలికారు. సర్ కాంగ్రెస్ హయాంలో కూడా జరిగిందని ప్రస్తావించారు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు ఉంటే... ఒక్కొక్కరిని వెతికి తొలగించాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. విదేశీయులను తొలగిస్తే రాహుల్‌గాంధీకి వచ్చిన నొప్పేంటని ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్‌లో సర్ జరిగినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది ఉందని.. కేంద్ర సిబ్బంది కాదని తేల్చిచెప్పారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్థాయికి తాను దిగజారనని అన్నారు. బీఆర్ఎస్ మీద కాంగ్రెస్ దొంగ ఓట్లతో గెలిచిందా..? అని ప్రశ్నించారు మాజీమంత్రి కేటీఆర్ రెండుసార్లు గెలిచి మంత్రి అయితే అప్పుడు ఎలక్ట్రానిక్ మిషన్ మంచిదా..? అని నిలదీశారు. ప్రజలు చాలా తెలివైనవాళ్లని చెప్పారు. సర్‌నీ రాహుల్‌గాంధీ వ్యతిరేకించిన.. తెలంగాణలో వాళ్లే పూర్తి చేస్తారని తెలిపారు.

**రైతులను కాంగ్రెస్ మోసం చేస్తోంది..**

రెండున్నరేళ్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతుల విషయంలో ఎక్కడ వేసినా గొంగళి అక్కడే ఉందని విమర్శించారు. రైతులకు అరకొర రుణమాఫీ.. లక్షలాది మంది రైతులు బ్యాంకుల దృష్టిలో డిఫాల్టర్స్ అయ్యారని చెప్పుకొచ్చారు. ధాన్యం కొనుగోలులో కేంద్రం అండగా ఉన్న... రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వైఫల్యం చెందుతోందని ప్రశ్నించారు. ఎంఎస్‌పిని కేంద్రం పెంచిన.. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఎందుకు ఇబ్బంది పడుతుందో అర్థం కాని పరిస్థితి ఉందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఎదురు దాడిపై దృష్టి పెడుతున్నారు తప్ప.. ఎందుకు ఆయా పంటలు కొనుగోలు చేయడం లేదో చెప్పట్లేదని ప్రశ్నించారు.

**సన్నవడ్లకు బోనస్ ఏది..?**

రూ.500 బోనస్ ఇస్తామని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద ప్రకటనలు చేశారని కిషన్‌రెడ్డి అన్నారు. సన్నవడ్లకు కూడా బోనస్ పూర్తిగా ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. ధాన్యం కొనుగోలులో ప్రతి పైసా కేంద్రం ఇస్తోందని స్పష్టం చేశారు. అన్నదాతకు కావాల్సిన ప్రతి వస్తువును కేంద్రప్రభుత్వమే ఇస్తోందని తేల్చిచెప్పారు. అనేక విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం పచ్చి అబద్ధాలు ఆడుతోందని ధ్వజమెత్తారు. వాళ్ల చేతకానీ తనం.. వాళ్ల వైఫల్యం ఇతరుల మీద రుద్ది.. వాళ్లు హీరోలం అవుదామని అనుకుంటున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు.


# పోలీస్ ప్రీమియర్ లీగ్ సీజన్-3 విజేతలకు సీపీ డా.శంఖబ్రత బాగ్చి బహుమతులు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం సిటీ పోలీస్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన "పోలీస్ ప్రీమియర్ లీగ్ – సీజన్ 3 2026" క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం ఘనంగా బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా హాజరై విజేత లకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భం గా సీపీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, టీమ్ స్పిరిట్ మరియు పరస్పర సమన్వ యాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విధుల ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు క్రమశి క్షణ, ఐక్యత, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జట్టు సభ్యులను అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 7 జట్లు పాల్గొనగా, సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ కానిస్టేబుళ్లు, హోంగార్డులు, కమ్యూ నిటీ గార్డులు కలిపి మొత్తం 112 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్ "పోలీస్ వారియర్స్" మరియు "పవర్ సోల్జర్స్" జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగింది. విజేతగా నిలి చిన "పోలీస్ వారియర్స్" జట్టుకు రూ.20 వేల నగదు బహుమతి మరియు ట్రోఫీని సీపీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన "పవర్ సోల్జర్స్" జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి మరియు ట్రోఫీ ప్రదానం చేశారు. మూడో స్థానం సాధించిన "హంటింగ్ కాప్స్" జట్టుకు ప్రత్యేక ట్రోఫీని అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ (ఏఆర్) ఎస్.వి. అప్పారావు, అడ్మిన్ ఆర్ఐ టి.ఉమామహేశ్వర రావు, సీటీసీ ఆర్ఐ కె. శ్రీనివాసరావు, ఎంటీ ఆర్ఐ సతీష్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సావరం ప్రీమియర్ లీగ్ ఎస్పీఎల్ సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం




**(రాజధాని వార్తలు):** అమలాపురం పట్టణంలో బైపాస్ రోడ్డు సావరంలో సావరం ప్రీమియర్ లీగ్ ఎస్పీఎల్ సీజన్ 3 క్రికెట్ టోర్నమెంట్ బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ మరియు మాజీ పార్లమెంట్ సభ్యురాలు చింతా అనురాధ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. చింతా అనురాధ, నల్లా పవన్ మాట్లాడుతూ సుమారు 40 టీమ్‌లు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి అని, క్రీడలను ప్రోత్సహించడం పట్ల ఆర్గనైజింగ్ యువతను అభినందించారు.

క్రీడల వలన శారీరక దృఢత్వం పెరిగి ఆరోగ్యంగా ఉంటారని, యువత ఆర్థిక క్రమశిక్షణ కలిగి మంచి భవిష్యత్తు ఏర్పరచుకోవాలని ఎప్పుడూ మా సహకారం ఉంటుం దని అన్నారు. నల్లా పవన్ పవన్ మొదటి మ్యాచ్ జనిపల్లి వారియర్స్ మరియు సావరం జూనియర్స్‌కి మధ్య టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అరిగెల నాని, గోకరకొండ గంగన్న స్వామి, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ, మంగళంపల్లి అంజిబాబు, మోటూరి సత్యంకాపు, కాదీర్, చిత్రపు అజయ్, పాము బాల, పల్లి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో ఘోరం.. కళ్లలో కారం చల్లి తల్లీకూతురి దారుణ హత్య




**ఇబ్రహీంపేట, (రాజధాని వార్తలు):** నల్లగొండ జిల్లాలో అత్యంత దారుణమైన ఘటన వెలుగు చూసింది. అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామంలో గుర్తు తెలియని దుండగులు నడిరోడ్డుపై ఘోరానికి ఒడిగట్టారు. తల్లీకూతురిని అత్యంత కిరాతకంగా హతమార్చడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతులను రుద్రాక్ష సుమలత, ఆమె కుమార్తె లావణ్యగా పోలీసులు గుర్తిం చారు. పక్కా పథకం ప్రకారం దాడి చేసిన హంతకులు.. కళ్లలో కారం చల్లి హత్య చేసినట్లు తెలిసింది. ఈ జంట హత్యల వెనుక భూతగాదాలే ప్రధాన కారణమై ఉండవచ్చని పోలీసులు అను మానిస్తున్నారు. కొంతకాలంగా మృతుల కుటుంబానికి, మరికొం దరికి మధ్య భూవివాదాలు నడుస్తున్నట్లు సమాచారం. పాత కక్షలను మనసులో పెట్టుకుని, ఒంటరిగా దొరికిన సమయంలో దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకు న్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా శని జయంతి పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణ పరిధిలో హరిహర క్షేత్రం అయిన శ్రీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శని జయంతి పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. శనీశ్వరస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు రద్దీ ఏర్పడింది. "ఓం శ్రీ శనీశ్వర స్వామి నమః" అంటూ ఆలయ ప్రాంగణం మొత్తం భక్తుల నినాదాలతో మార్మోగింది. శని అనుగ్రహం ఉంటే జీవితంలో విజయాలు, శుభఫలితాలు కలుగుతాయని ఆలయ పురోహితులు అన్నారు. ఈ పూజల్లో సామర్లకోట పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు, ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## యుద్ధం మధ్యలో నువ్వు, నేను, మనందరం!

యుద్ధంలో వెనుకడుగువేయడం పిరికివాళ్ల లక్షణమనీ, యుద్ధాన్ని పోరాడి గెలవాలనీ అంటారు. మరి యుద్ధం మనతో మనకే అయితే! మనిషికీ, మనసుకీ జరిగే ఘర్షణ మధ్య మనిషి ఎటుపోవాలి, దేనితో యుద్ధం చేయాలి? అదిగో సరిగ్గా అలాంటి యుద్ధ భూమిలోనే నేడు నువ్వు, నేను, వాళ్ళు, వీళ్ళు అందరం చిక్కుబడి ఉన్నాం అంటారు కవి అఫ్సర్. యుద్ధం ఎక్కడో జరుగుతోంది, మనమిక్కడ శాంతిగా ఉన్నాం.. అనుకుంటూ భ్రమల్లో బతుకుతూ, కళ్ల ముందు రగులుతున్న మంటలను చూస్తూ కూడా నిద్రని నటిస్తూ, శాంతిని కల కంటున్నాం అనుకుంటూ, రణరంగంలాంటి మనసుతో ఎటువైపు అడుగేయాలో తెలియక అనుక్షణం మనిషి తనతో తానే ఘర్షణ పడుతున్నాడు; కార్చిచ్చు లాంటి ఆ మంటలు మన కాళ్ల కింది నేల మీదికి వచ్చేలోగా మత్తులాంటి నిద్ర నుంచి మేలు కోవాలి అని హెచ్చరిస్తున్నాడు కవి ఇక్కడ. అఫ్సర్ ఆంగ్లంలో రాసిన 'Fasting Hymns'ను 'ఉపవాస పద్యాలు' పేరుతో తెలుగులోకి శ్రీనివాస్ గౌడ్ అనువదించారు. ఆ పద్యాల్లో ఓ చోట "ఇఫ్తార్ లేదా సహార్ ఏదో ఒక విందులో పళ్ళెం చేతులోకి తీసుకుని ఓ ఖర్జుర పండుని నోట్లో పెట్టుకోబోతాను. ఆ క్షణంలోనే యుద్ధ శరణార్థ శిబిరాల్లో అవయవాలు తెగి, నెత్తుటి గాయాలతో ఆర్తనాదాలు చేసే వేలమందో, వందల మందో తిన్నారో లేదో అనిపిస్తుంది. కన్నవాళ్లను కోల్పోయి అనాథలైన ఎంతమంది చిన్నారులు ఆకలికి అలమటిస్తున్నారో అని తలపుకు వస్తే చాలు, నోట్లో పెట్టుకున్న ఖర్జుర పండు చేదుగా అనిపిస్తుంది" అంటారు. పుట్టిన గడ్డ మీద కూడా పరాయితనాన్ని అంటగట్టే ఆటవిక శక్తులతో నిరంతరం పోరాడాల్సిందే అంటారు. ఆ ఆవేదనకు కొనసాగింపుగా ఈ 'యుద్ధం మధ్యలో నువ్వు' అనే శీర్షికతో వచ్చిన కవిత్వ సంపుటిలో- నేటి యుద్ధం మనుషుల మధ్యనే కాదు, ఇప్పుడు మనిషి బతికి బట్టకట్టాలంటే చాల రకాల యుద్ధాలు చేయాలి, కంటికి కనిపించని అరాచక శక్తులతో కూడా పోరాటం జరపాల్సిందే అంటారు. మరికొన్ని కవితల్లా అనిపించనివి ఉన్నాయి. మనస్సనే యుద్ధ భూమిలో అప్పటికప్పుడు అనుభవించిన సంవేదనలకు అక్షర రూపం కల్పించి చిత్తశాంతిని పొందడానికి ఈ కవితలు రాశారు అనిపిస్తుంది. వచనాలు పేరాగ్రాఫ్ శైలిలో మనల్ని పలకరిస్తాయి. కొమ్మా రెమ్మా కదలని ఓ నిశ్శబ్ద వేసవి మధ్యాహ్నమో, రెప్పవాలని నిశిరాత్రో హృదయాన్ని మెలితిప్పిన ఏ సంఘటనకో మనసులో ఉత్పన్నం అయిన ఏ వేదనకో వచనాక్షరాలు తోడై తెల్లటి పుస్తక క్షేత్రంలో నల్లటి అక్షర విత్తనాలను చల్లుకుంటూ పోయే అక్షర కృషీవలుడు ఈ 'యుద్ధం మధ్యలో నువ్వు' సంపుటిలో కనిపిస్తాడు. ఈ సంపుటిలో మనం మూడు విభాగాల్లో కవితల్ని దర్శించవచ్చు. మొదటి విభాగాన్ని 'కత్తి అంచు మీద నిలబడి', రెండో విభాగాన్ని 'ఆరు కాలాలు మాయమైన చోట', మూడో విభాగాన్ని 'పంజరాల్ని ఓడించినప్పుడు' అనే శీర్షికలతో రాశారు. "Being a good friend means listening... ఒక్క క్షణం, తమ ఒక్క మాటని, ఆవేదనని వినేవాళ్ళు ఒక్కరు ఉన్నా, ఆ ఉన్నవాళ్ళు హృదయ సంపన్నులు అయితే, ఎంతోమంది ఆత్మీయుల బలవన్మరణాలను ఆపవచ్చు. కానీ వినేవారేరి?" అంటూ బాధగా రాసారు 'తెరవెనుక' అనే కవిత వచనాత్మకమైన చోట. "దారిలో ఎవరో ఎదురొస్తారని - నువ్వు నడక మొదలుపెట్టలేదుగా - నొప్పించే రాళ్ళ సమూహాలు - అడుగడుక్కీ నీకేం కొత్త కూడా కాదుగా!" అంటారు 'అయిదు నొప్పించే పద్యాలు' కవితలో. మన ప్రయాణం ఒంటరిదైనా, గమ్యం తెలియనిదైనా, దారి నిండా ముళ్ళూ రాళ్ళూ నడక వేగాన్ని నియంత్రించినా, ప్రయాణాన్ని మాత్రం ఆపకూడదు. అగాధపు జలనిధుల్లో ఆణిముత్యాలు, పగడపు దీవులు ఎదురైనట్లు, పయనపు దారుల్లో నీ వెనుక ఇంకో నాలుగడుగులు తోడవ్వచ్చు. వెలుగు దీపాల్లాంటి ప్రేమ మూర్తులు ఎదురు కావచ్చు. మొదలుపెట్టిన ప్రయాణంలో ఎన్నడూ వెనుకడుగు వేయకూడదంటూ ఆశావహ దృక్పథంతో ముందుకు పొమ్మంటారు. "ఎక్కడో యుద్ధాలు జరుగుతున్నాయని అనుకుంటూ - ఇక్కడేదో శాంతిలాంటిదేదో ఉంది కదా అని చల్లటి స్పర్శలాగా ఉంటావు కానీ, నువ్వొక రణరంగమైన పెనుమంట అని పొరపాటున కూడా అనుకోవు కదా!" 'యుద్ధం మధ్యలో నువ్వు' అనే వచన కవిత్వంలో "యుద్ధం ఎక్కడో జరగడంలేదు. దురాగతాలను, అన్యాయాలను చూసిన చోట నీ మనసే ఒక రణరంగం. నీ అంతరంగం నిండా రగులుతున్న ఆవేదనకు పోరాటపు పదును పెట్టి, బలహీనమైన పక్షం వైపు నీ అడుగులు పడితే, అప్పుడు యుద్ధం మధ్యలో నిలబడ్డ చైతన్యపు శతఘ్నివి నువ్వే అవుతావు" అంటారు కవి. "చెప్పడానికి చాల ఉన్నప్పుడు - పెదాల్ని కుట్టేసేవాళ్ళు పుట్టుకొస్తారు" "...అన్యాయాలను ఎదిరించడానికి ఎత్తిన చేయిని నరికేవాళ్ళు, నాలుగు శాంతివచనాలను ప్రవచించాలని నోరుతెరిచిన వాళ్ల నాలుకను తెగ్గొట్టే వాళ్ళు, నవ సమాజ నిర్మాణానికి నడుంకట్టే వాళ్లని పంజరాల్లో బంధించేవాళ్ళు పుట్టుకొస్తూనే ఉంటారు. అయినా సమానత్వ పురోగమన బాటలో నేను వెలుతురు వైపుకే నడుస్తాను" అని తన దృఢ నిశ్చయాన్ని తెలియచేసారు కవి 'పంజరంలోని పాటలు' కవితలో. "తల మీద కాస్త ఆకాశం ఉంది - కాళ్ల కింద ఇంకొంచెం నేల మిగిలే ఉంది - గుండెలో తడిని ఇంకా ఏ యెడారో కావిలించుకోలేదు - పెదవి మీది మాటని ఇంకెవరూ తుంచుకెళ్ళలేదు - కాబట్టి - కాసింత ప్రశాంతంగానే నిద్రమబ్బుల్ని ఈ రోజు తరిమేస్తాను - నీదైన వెలుగులోకి సరాసరి నడిచే వస్తాను" - జీవితం నిండా ఆవరించుకున్న ఎన్నో ప్రేమలు, నమ్మకాలు, సంతోషాలు, సమాగమాలు, ఎందరో ఆప్తుల నిష్క్రమణలు ఎన్నింటినో చూసి ఉంటాడు కవి.

# ఆర్వో ప్లాంట్ సేవలు అభినందనీయం... స్టేషన్ సెంటర్ మరింత అభివృద్ధికి కృషి





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట లయన్స్ క్లబ్ శ్రీ భీమేశ్వర సేవలు అభినందనీయమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు అన్నారు. సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షల వ్యయంతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్వో ప్లాంట్‌ను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే చినరాజప్ప డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామర్లకోట రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లు ఎదురెదురుగా ఉన్నందున ప్రతిరోజు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే ప్రయాణికుల సంఖ్య వేలల్లో ఉంటుందన్నారు. వారందరికీ రక్షిత త్రాగునీటితోపాటు చల్లని త్రాగు నీరు అందించేందుకు ఈ ఆరో ప్లాంట్ ఎంత ఉపయోగపడుతుంది అన్నారు. రానున్న రోజుల్లో స్థానిక స్టేషన్ సెంటర్ రహదారిని విశాలపరిచి, సుందరంగా దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సామర్లకోట పెద్దాపురం మున్సిపాలిటీల ప్రజలకు ఏలూరు రిజర్వాయర్ నుంచి నేరుగా శుద్ధ జలాలు అందించేందుకు ఒక్క మున్సిపాలిటీకి 37 కోట్లు చొప్పున నిధులతో ప్రత్యేక పైప్లైన్ ఏర్పాటు పనులు త్వరలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధిలో భాగంగా పెద్దాపురంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా మున్సిపల్ సెంటర్ లోనికి తీసుకు వచ్చినట్టు చెప్పారు. అలాగే పెద్దాపురంలో ఐదు కోట్ల రూపాయలతో ఓల్డ్ ఏజ్ హోం నిర్మాణం చేపడుతుండగా మరో మూడు నెలలో దానిని పూర్తి చేయనున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. కాగా సామర్లకోట లయన్స్ క్లబ్ నిరంతరం ప్రజల సేవలో ముందుండి పలు సేవా కార్యక్ర మాలు చేపడుతున్నట్లు చెప్పారు. క్లబ్ నాయకులను అభినందించకుండా ఉండలేమన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తన అధ్యక్ష పదవీ కాలంలో ఇది 150వ సేవా కార్యక్రమంగా చెప్పారు. సుమారు రెండు లక్షల వ్యయంతో ప్రయాణికులకు ఆరోగ్యకరమైన త్రాగునీరు అందిస్తూ వారి దాహార్తిని తీర్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్లు ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్వ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన లయన్స్ క్లబ్ నాయకులను ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్లు సత్కరించి ఘనంగా అభినందించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించిన "స్వచ్ఛంద" కార్యక్రమాన్ని వారు ప్రారంభిస్తూ పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 20 సూత్రాల చైర్మన్ దినకర్, మాలకొండయ్య, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, తెలుగుదేశం పార్టీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు, జనసేన నాయకులు పిట్ట జానకి రామారావు, దొమ్మేటి శ్రీనివాసరావు (సరోజ వాసు), మంచెం సాయిబాబు, లయన్స్ క్లబ్ నాయకులు బడుగు బాబి, సేపెనీ సురేష్, మేకా శ్రీనివాసరావు, కూటమి నాయకులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# మరణించిన కుటుంబాలకు సొంత నిధులతో తక్షణ సహాయం

## - అంత్యక్రియల కోసం లక్ష రూపాయలు ప్రకటించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ





**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** శనివారం ఉదయం చీడిగా గ్రామం సమీపంలో జరిగిన విషాదకర లారీ ప్రమాదంలో ఉపాధి హామీ పథకానికి చెందిన పలువురు శ్రామికులు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను, అలాగే మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయంగా, అంత్యక్రియల నిమిత్తం ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున సొంత నిధులతో సహాయం ప్రకటించారు. ఈ చెక్కులను ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ బాధిత కుటుంబాలకు అందజేయనున్నారు.

అలాగే గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి అధికారులను ఎమ్మెల్యే కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున కూడా తగిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రాష్ట్ర 20 పధకాల చైర్మన్ ప్రత్యేక పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర ఆలయంలో ఆంధ్రప్రదేశ్ 20 పధకాల పధకాల చైర్మన్ లంక దినకర్ ప్రత్యేక పూజలు చేపట్టారు. శనివారం ఆయన ఆలయానికి విచ్చేయగా ఆయనకు ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం, ఆలయ చైర్మన్ కంటే జగదీశ్ మోహన్‌ల ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్ దినకర్ భీమేశ్వర స్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నంది మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేసారు. అనంతరం ఆలయ అధికారి ఆయనకు స్వామి వారి ప్రసాదములు, స్వామి వారి చిత్రపటం అందజేసియున్నారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, వేదపండితుల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ చలివేంద్రం ప్రారంభించిన డిసిసిబి చైర్మన్



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం పులిమేరు గ్రామంలో కీర్తిశేషులు తుమ్మల భూలక్ష్మి జ్ఞాపకార్థం తుమ్మల బుల్లియ్య కుటుంబం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగుతున్నారని తెలిపారు. మండుతున్న ఎండల నేపథ్యంలో గ్రామ ప్రజలు, బాటసారులు దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన ఈ మజ్జిగ చలివేంద్రం సేవా కార్యక్రమాలకు నిదర్శనమన్నారు. తుమ్మల భూలక్ష్మి సేవాస్ఫూర్తిని స్మరించుకుంటూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలకు అండగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, గ్రామ సర్పంచ్ తుమ్మల నాని బాబు, వంగలపూడి దుర్గాజి, నీటి సంఘం అధ్యక్షులు మాదిరెడ్డి రామకృష్ణ, వీర మహిళలు, యువజన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎన్నికల నాటికి విద్యుత్ ఛార్జీలు తగ్గించడమే లక్ష్యం : మంత్రి గొట్టిపాటి




**అమరావతి, (రాజధాని వార్తలు):** రాబోయే ఎన్నికల నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే వినియోగదారులకు భారీ ఊరటనిస్తూ యూనిట్‌కు రూపాయి చొప్పున ఛార్జీలను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**అధిక జ్యేష్ఠ మాసం.. ఈ పనులు చేయకూడదు..**

ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. 'దేశంలో ట్రూఅప్ పేరిట ఛార్జీలు పెరుగుతుంటే.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో ట్రూడౌన్ విధానం ద్వారా విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన తప్పుడు విధానాల వల్ల విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంస్కరణలు, ప్రక్షాళన చర్యల వల్ల సానుకూల ఫలితాలు వస్తున్నాయి. భవిష్యత్తు విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పునరుద్పాదక విద్యుత్ రంగాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. సీఎం చంద్రబాబు నాయుడు.. కేంద్ర ప్రభుత్వంతో జరిపిన ప్రత్యేక సంప్రదింపుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో 20 లక్షల ప్రధానమంత్రి సూర్యఘర్ కనెక్షన్లు మంజూరయ్యాయి. సామాన్యుడికి సైతం నాణ్యమైన, అంతరాయం లేని కరెంటును అత్యంత తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకు రావాలనే సంకల్పంతోనే ప్రభుత్వం అడుగులు వేస్తోంది' అని మంత్రి పేర్కొన్నారు.

# హైబ్రిడ్ మోడల్‌లో మహానాడు నిర్వహిస్తాం : పల్లా శ్రీనివాసరావు



**విశాఖపట్నం (గాజువాక), (రాజధాని వార్తలు):** మహానాడు రద్దుపై తెలుగుదేశం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాలతో ఇంధన వనరులు ఆదా చేసుకునే నేపథ్యంలో భాగంగా నెల్లూరులో జరగాల్సిన మహానాడు కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలో పల్లా శ్రీనివాసరావు పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ ఆలోచనతో, సీఎం చంద్రబాబు ఏకీభవిస్తూ మహానాడును రద్దు చేశారని వెల్లడించారు. కోవిడ్ లాంటి సమయంలో వర్చువల్ మహానాడును ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. ఇప్పుడు మహానాడు కార్యక్రమానికి రూ. 5 నుంచి రూ. 10 కోట్లు ఖర్చుతో కూడుకున్న విషయమని, అలాగే దాదాపుగా పదివేల వాహనాలు మహానాడుకు చేరుకుంటాయని చెప్పుకొచ్చారు. ఇంధన వనరులు ఆదా చేసుకోవడం కోసం ప్రతి నియోజకవర్గంలో హైబ్రిడ్ మోడల్ మహానాడు నిర్వహిస్తామని వివరించారు. 1848 భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ప్రజలు వీక్షించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం ప్రాంగణంలో పార్టీకి చెందిన 68 మంది సీనియర్ నేతలతో కూడిన బృందం మహానాడు సందర్భంగా దిశానిర్దేశం చేస్తారని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# రామ్ పోతినేని.. రిస్క్‌ను ఈజీగా డీల్ చేస్తారా?



టాలీవుడ్ హీరోలు దర్శకులుగా మారడం కొత్త విషయం కాదు. కానీ ఆ జర్నీలో అందరికీ విజయం దక్కిందా? అంటే సమాధానం మాత్రం మిక్స్‌డ్‌గానే కనిపిస్తుంది. ఇప్పుడు అదే చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. కారణం ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని దర్శకుడిగా మారడం. తన నెక్ట్స్ మూవీతో మెగాఫోన్ పట్టబోతున్నట్లు ప్రకటించిన రామ్.. నటుడిగా మాత్రమే కాకుండా కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను చేపట్టడం ఆసక్తికర చర్చకు దారి తీసింది. ఇప్పటికే చాలా మంది తెలుగు హీరోలు.. డైరక్షన్ పై ఇంట్రెస్ట్ చూపించారు. కొందరు తమ ఆలోచనలను తెరపైకి తీసుకు రావాలని ప్రయత్నిస్తే, మరికొందరు తమ కెరీర్ కు కొత్త దిశ ఇవ్వాలనే ఉద్దేశంతో దర్శకత్వం వైపు అడుగులు వేశారు. అయితే నటుడిగా సక్సెస్ అయినంత సులభంగా దర్శకుడిగా నిలబడటం అంత ఈజీ కాదని గత అనుభవాలు చెబుతున్నాయి. దర్శకత్వం అంటే కేవలం కథ చెప్పడం మాత్రమే కాదు. ఒకేసారి కథ, స్క్రీన్ ప్లే, నటీనటుల పనితీరు, టెక్నికల్ టీమ్, బడ్జెట్, షూటింగ్ ప్లానింగ్ వంటి అనేక అంశాలు ప్లాన్ చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తే బాధ్యత మరింత పెరుగుతుంది. కెమెరా ముందు పాత్రలో పూర్తిగా మునిగిపోవాలి. అదే సమయంలో కెమెరా వెనుక ప్రతి ఫ్రేమ్ పర్యవేక్షించాలి. ఆ బ్యాలెన్స్ చేయలేక చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు రామ్ కూడా ఇలాంటి సవాల్ ముందు నిలిచారు. ఆయన కొత్త చిత్రం RAPO23 స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. వీర పాత్రలో రామ్ కనిపించనుండగా.. ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్ అనే క్యాప్షన్ క్యూరియాసిటీ పెంచుతోంది. అయితే ఆ ప్రాజెక్ట్‌లో రామ్ తీసుకున్న బాధ్యతలు మాత్రం నార్మల్‌వి కావు. హీరోగా నటించడం, కథ రాయడం, దర్శకత్వం వహించడం, నిర్మాణం భాగం కావడం.. ఇలా పెద్ద బాధ్యతలే మోస్తున్నారు. ఇక టైమింగ్ కూడా ఇప్పుడు రామ్‌కు కీలక అంశంగా మారింది. జూన్‌లో షూటింగ్ ప్రారంభించి డిసెంబర్‌లోనే సినిమాను విడుదల చేయాలని ప్రకటించారు. అంటే చాలా వేగంగా షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవైపు నటన, మరో వైపు దర్శకత్వం.. రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ క్వాలిటీ కాంప్రమైజ్ కాకుండా చూడడం పెద్ద బాధ్యతే. మరోవైపు రామ్‌కు ఒక భారీ హిట్ కూడా చాలా అవసరం. గత కొన్ని సినిమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడంతో నెక్ట్స్ మూవీ ఆయనకు కీలకంగా మారింది. అందుకే ప్రాజెక్టుపై అందరి దృష్టి పడింది. రామ్‌లో ఉన్న ఎనర్జీ, డాన్స్, యాక్షన్, రైటింగ్ గురించి ఇప్పటికే ప్రేక్షకులకు తెలుసు. ఇటీవల 'ఆంధ్రా కింగ్ తాలూకాలో పాట రాసి, పాడి తనలోని మరో కోణాన్ని చూపించారు.

ఇప్పుడు దర్శకుడిగా తన ముద్ర వేయాలని ప్రయత్నిస్తున్నారు. అయితే టాలీవుడ్‌లో గత అనుభవాలను చూస్తే హీరో నుంచి దర్శకుడిగా మారడం అనేది పెద్ద రిస్క్ అని చెప్పాలి. కొందరు సక్సెస్ అయినా, చాలామంది మాత్రం ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయారు. అందుకే ఇప్పుడు అందరి చూపు రామ్ పైనే ఉంది. ఆయన ఆ భారీ బాధ్యతలు ఈజీగా డీల్ చేస్తారా? దర్శకుడిగా కూడా సక్సెస్ అవుతారా? అన్న ఆసక్తి కనిపిస్తోంది.

# సూర్యకు అదే కలిసొచ్చిందా?



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య గత కొంతకాలంగా సరైన బ్లాక్ బస్టర్ కోసం ఎదురు చూస్తున్నారు. భారీ అంచనాల మధ్య వచ్చిన కంగువ, రెట్రో సినిమాలు ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోవడంతో అభిమానుల్లో కూడా కొంత నిరాశ కనిపించింది. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా విడుదలైన కరుప్పు సినిమా ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద హాట్ టాపిక్‌గా మారింది. తెలుగులో వీరభద్రుడు పేరుతో విడుదలైన ఆ చిత్రం విడుదలకు ముందే మంచి బజ్ సృష్టించింది. సినిమా ఒక రోజు ఆలస్యంగా థియేటర్లలోకి వచ్చినా, ఓపెనింగ్స్ మాత్రం బాగానే దక్కించుకుంది. అయితే సినిమా విడుదలైన తర్వాత మొదట వచ్చిన స్పందన పూర్తిగా పాజిటివ్‌గా లేకపోవడం గమనార్హం. సోషల్ మీడియాలో కొందరు ప్రేక్షకులు కథ, స్క్రీన్ ప్లే, ఎమోషనల్ కనెక్ట్ విషయంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. విమర్శకుల నుంచి కూడా మిక్స్‌డ్ రివ్యూలే వచ్చాయి. అయినప్పటికీ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబడుతుండటం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించడంతో అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కరుప్పు సినిమాకు కలిసొచ్చిన అంశాల్లో ప్రధానంగా సమ్మర్ సీజన్‌ను చెప్పుకోవాలి. గత కొన్ని వారాలుగా థియేటర్లలో పెద్ద సినిమాలు లేకపోవడం కరుప్పు మూవీకి బాగా ఉపయోగపడిందని మూవీ ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్, మాస్ ప్రేక్షకులకు పెద్దగా ఆప్షన్లు లేకపోవడంతో ఆ సినిమా వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. అదే సమయంలో సినిమా పూర్తిగా నెగిటివ్ టాక్ తెచ్చుకోకపోవడం కూడా కలెక్షన్లపై ప్రభావం చూపిందని భావిస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ ఎలిమెంట్స్‌కు మాస్ ఆడియన్స్ నుంచి మంచి స్పందన వస్తోందని సమాచారం. కొన్ని ఫైట్స్, ఎలివేషన్ సీన్స్ థియేటర్లలో విజిల్స్ కొట్టేలా ఉన్నాయని అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. సూర్య స్క్రీన్ ప్రెజెన్స్ కూడా సినిమాకు ప్రధాన బలం అయిందని చెబుతున్నారు. ఫ్యాన్స్‌ను టార్గెట్ చేస్తూ మాస్ కమర్షియల్ ఫార్మాట్ లో తెరకెక్కించిన సినిమా బీ, సీ సెంటర్లలో మంచి వసూళ్లు సాధిస్తోందని టాక్. ఇక సినిమాలో హీరోయిన్‌గా త్రిష కృష్ణన్ నటించారు. చాలా కాలం తర్వాత సూర్య-త్రిష జోడీ తెరపై కనిపించడం ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచింది. అలాగే కీలక పాత్రల్లో ఇంద్రాన్స్, స్వసిక విజయ్, యోగిబాబు, ఆడుకాలం నరేన్, మన్సూర్ అలీ ఖాన్, జార్జ్ మార్యన్ తదితరులు నటించారు. సినిమాకు దర్శకుడిగా ఆర్జే బాలాజీ వ్యవహరించగా.. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఆర్ ప్రభు, ఎస్ఆర్ ప్రకాష్ బాబు చిత్రాన్ని నిర్మించారు. సాంకేతికంగా కూడా సినిమా మంచి మార్కులు దక్కించుకుంటోంది. ఏదేమైనా ఇప్పుడు కోలీవుడ్, టాలీవుడ్ వర్గాల్లో ఒకే చర్చ నడుస్తోంది. మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ సరైన సమయంలో విడుదల కావడం, పెద్ద పోటీ సినిమాలు లేకపోవడం, మాస్ ఎలిమెంట్స్ పనిచేయడం వంటి అంశాలు కరుప్పు మూవీకి కలిసి వచ్చినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం థియేటర్లలో సినిమా మంచి ఆక్యుపెన్సీతో కొనసాగుతుండటంతో ఫైనల్ రన్‌లో మూవీ ఇంకెంత వసూళ్లు సాధిస్తుందో చూడాల్సి ఉంది.

# బ్లూ అవుట్ ఫిట్ లో పాయల్ హొయలు



టాలీవుడ్‌లో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' సినిమాలతో బలమైన ముద్ర వేసుకుంది బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్. తాజాగా ఈ అమ్మడు ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేసిన కొన్ని ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. నేవీ బ్లూ కలర్ హాల్టర్ నెక్ అవుట్‌ఫిట్‌లో పాయల్ అల్ట్రా స్టైలిష్‌గా మెరిసిపోయింది. "ఇన్‌హేల్ -ఎక్స్‌హేల్" అంటూ షేర్ చేసిన ఈ ఫోటోషూట్‌లో ఆమె గ్లామర్, రాయల్ లుక్ అభిమానులను తెగ ఆకట్టుకుంటోంది.


**బ్లూ డ్రెస్‌లో పాయల్ మాయ:**

పాయల్ రాజ్‌పుత్ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ తన లేటెస్ట్ అప్‌డేట్స్‌ను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలు కుర్రాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. ఒక సాఫ్ట్ బ్రౌన్ బ్యాక్‌డ్రాప్‌లో, డీప్ బ్లూ కలర్ స్లీవ్‌లెస్ హాల్టర్ నెక్ డ్రెస్ వేసుకుని పాయల్ ఇచ్చిన పోజులు అదిరిపోయాయి. దీనికి తోడు ఆమె వేసుకున్న షిమ్మర్ హీల్స్ ఈ లుక్‌కు మరింత రాయల్ టచ్ ఇచ్చాయి. ఇక స్టైలింగ్ నుండి మేకప్ వరకు ప్రతిదీ పర్ఫెక్ట్‌గా కుదరడంతో పాయల్ ఇందులో చాలా ఎలిగెంట్‌గా కనిపిస్తోంది.

**క్యారెక్టర్ ఏదైనా పాయల్ వన్ మ్యాన్ షో:**

పంజాబీ భామ అయినప్పటికీ తెలుగులో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది పాయల్. 'వెంకీ మామ', 'గిన్నా' వంటి కమర్షియల్ సినిమాల్లో గ్లామర్ పండించినా.. 'మంగళవారం' లాంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాలో ఇంటెన్స్ రోల్ చేసి అందరినీ మెప్పించింది. ఇక నటనకు స్కోప్ ఉన్న పాత్రలైనా, గ్లామర్ రోల్స్ అయినా నేను రెడీ అంటూ ఈ బ్యూటీ వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతోంది. కమర్షియల్ ఎలిమెంట్స్‌ను, సీరియస్ రోల్స్‌ను బ్యాలెన్స్ చేయడంలో పాయల్ రూటే వేరు. ప్రస్తుతం పాయల్ కెరీర్ ఫుల్ స్వింగ్‌లో ఉంది. కేవలం తెలుగులోనే కాకుండా పంజాబీలోనూ వరుస సినిమాలు చేస్తోంది. లీడర్, గోల్‌మాల్, కిరాతక, ది గ్రేట్ పంజాబ్ రాబరీ వంటి పలు ఆసక్తికరమైన చిత్రాలు ప్రస్తుతం ఆమె పైప్‌లైన్‌లో ఉన్నాయి. ఇక సినిమా సినిమాకూ వైవిధ్యం చూపిస్తూ, తనకంటూ క్రేజీ మార్కెట్ క్రియేట్ చేసుకుంటోంది. ఈ సినిమాలతో ఆమె రేంజ్ మరింత పెరగడం ఖాయం అనిపిస్తోంది. పాయల్ రాజ్‌పుత్ కెరీర్‌లో మరో బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ రాబోతుంది.అదే ముని దర్శకత్వంలో ఆమె 'వెంకటలక్ష్మి' అనే పవర్‌ఫుల్ పాన్ ఇండియా సినిమాలో నటిస్తోంది. ఒక గిరిజన అమ్మాయి రివెంజ్ స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ యాక్షన్ డ్రామా తెరకెక్కుతోంది. ఇక ఈ సినిమా గురించి తాజాగా ఆమె మాట్లాడుతూ.. "డైరెక్టర్ ముని కథ చెప్పినప్పుడు నేను ఫిదా అయిపోయాను. ఈ సినిమా తర్వాత జనాలు నన్ను 'వెంకటలక్ష్మి'గా ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారు" అని చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పింది.ఇక సౌరభ్ ధింగ్రా హీరోగా నటిస్తున్న ఈ సినిమా పాయల్ కెరీర్‌ను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్తుందని మేకర్స్ నమ్ముతున్నారు.

# కియారా మనసులో మాట..వాళ్లకే ఓటు!



బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వాణీ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఉత్తరాదిన అమ్మడి కెరీర్ దేదీప్య మానగా సాగిపోతుంది. అడపా దడపా తెలుగు సినిమాల్లోనూ నటిస్తూ సత్తా చాటుతోంది. అలాగే గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథా బలం సహా నటకు ఆస్కారం ఉన్న చిత్రాలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును దక్కించుకుంది. అయితే సందర్భాన్ని బట్టి మహిళాపాత్రల ప్రాధాన్యత వాటి రూపకల్పనలో వస్తోన్న మార్పులపై కియారా ఎల్లప్పుడూ గళాన్ని వినిపిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా అమ్మడు సినిమాల్లో మహిళల ప్రాతినిధ్యం – వారి పాత్రల ప్రాముఖ్యత పై అమ్మడు చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. సినిమాల్లో మహిళా శక్తిని చూడటం ఎంతో ఇష్టం. వెండితెరపై బలమైన మహిళా పాత్రలు ఉన్నప్పుడు అవి కథకు ప్రత్యేకమైన అందాన్ని, నిండుదనాన్ని తీసుకొస్తాయి. కేవలం నాయికగా కనిపించడమే కాకుండా? కథను మలుపు తిప్పే శక్తి ఆ పాత్రలకు ఉన్నప్పుడు నటిగా ఎంతో సంతృప్తిని ఇస్తుంది- అని కియారా తెలిపింది. గత కొన్ని సంవత్సరాలుగా కథానాయికల పాత్రల పరిధి పెరగడం పట్ల సంతోషం వ్యక్తం చేసింది. అలాగే స్త్రీ పాత్రలతో సినిమాల్లో ఎలాంటి మార్పు వస్తుందనే అంశంపైనా అమ్మడు స్పందచింది. మహిళా పాత్రలు భావోద్వేగాలకే పరిమితం కాకుండా.. నిర్దిష్టమైన లోతును కథకు జోడిస్తాయంది. ఈ లోతు అనేది మహిళా ప్రేక్షకులను మాత్రమే కాకుండా పురుషులను సైతం విపరీతంగా ఆకట్టుకుంటుందని కియారా తెలిపింది. కొన్ని కథలో స్త్రీ, పురుష పాత్రల్లో సమతుల్యత ఉన్నప్పుడే ఆ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందంది. నేటి తరం చిత్రాల్లో దర్శకులు మహిళల కోణాన్ని.. వారి ఆలోచనలను విభిన్న రకాలుగా ఆవిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారని కియారా కొనియాడారు. కేవలం కమర్షియల్ హంగుల కోసమే కాకుండా సమాజంలో మహిళలు ఎదుర్కొనే వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా పాత్రలను డిజైన్ చేయడం శుభపరిణామంగా పేర్కొంది. నటీమణులు కూడా గ్లామర్ చట్రం నుండి బయటకు వచ్చి విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రలు చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారంది. ఇది సినిమా ఇండస్ట్రీ ఎదుగు దలకు ఎంతో అవసరమని తెలిపింది. ఇటీవల లేడీ ఓరియేంటెడ్ చిత్రాలకు సరైన గుర్తింపు దక్కడం లేదని పలువురు భామలు అభిప్రాయపడుతోన్న వేళ కియారా వ్యాఖ్యలకు అలాంటి వారందరికీ మద్దతుగా నిలిచినట్లు అయింది. ఇక కియారా అద్వానీ కెరీర్ గ్రాఫ్‌ను పరిశీలిస్తే అమ్మడు కేవలం గ్లామరస్ రోల్స్ మాత్రమే కాకుండా-షేర్షా-, -జుగ్‌జుగ్ జీయో-, -సత్యప్రేమ్ కీ కథ- వంటి చిత్రాలలో ఎంతో ప్రాధాన్యత ఉన్న మహిళా పాత్రలలో నటించి మెప్పించింది. కమర్శియల్ కథల్లో నటిస్తూనే నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లో అవకాశాలు తెలివిగా ఒడిసి పట్టుకుంటుంది.

# సత్య కాలేజ్ విద్యార్థిని మెన్ & ఉమెన్ బీచ్ కబడ్డీ పోటీలలో చాంపియన్

## - 13వ అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో బి.నీలిమ ప్రతిభ




**విజయనగరం, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా దువ్వూరు, సంగం మండలం ఆధ్వర్యంలో 13వ అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 7, 8, 9, 10 తేదీలలో వివిధ క్రీడా మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడినాయి. ఇందులో భాగంగా జరిగిన కబడ్డీ పోటీలలో సత్య కాలేజ్ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని విశేష ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో "సత్య కాలేజ్" కు చెందిన బి. నీలిమ (బిఏ ఫైనల్ ఇయర్) అద్భుతమైన ఆటతీరుతో విజయం సాధించి కళాశాలకు గౌరవం తీసుకు వచ్చింది. ఆమె చురుకుదనం, జట్టు సమన్వయం మరియు ధైర్యసాహసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కబడ్డీ పోటీలకు స్థానిక క్రీడా అభివృద్ధి సంఘం మరియు సామాజిక సేవా సంస్థల సహకారం అందించబడింది. పోటీల నిర్వహణకు స్పాన్సర్‌గా వ్యవహరించిన నిర్వాహకులు యువతుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు తమవంతు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సత్య కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ్ విద్యార్థిని బి.నీలిమను అభినందిస్తూ, క్రీడలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం మరియు క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోపాలరావు హాజరై విజేతలను అభినందించారు. కబడ్డీ పోటీల నిర్వాహకులు: కె.వి. ప్రభావతి – అధ్యక్షురాలు, వై.శ్రీకాంత్ – కార్యదర్శి. అలాగే కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మరియు ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎం. సత్యవేణి విద్యార్థిని బి.నీలిమను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో విద్యార్థినులు ముందుకు రావడం ఎంతో ఆనందకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నలుగురు భిక్షాటన బాలలు గుర్తింపు

## - జైలు శిక్ష తప్పదని తల్లులకు హెచ్చరిక



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి సిహెచ్.లక్ష్మీ సూచనలు మేరకు జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సామర్లకోట పట్టణంలోని శ్రీ భీమేశ్వర ఆలయ ప్రాంగణం, రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో బిక్షాటనలో ఉన్న బాలలను, వీధి బాలలను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్, అవగా హన కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, క్రాఫ్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి దుర్గారాణి, చినబాబు, దుర్గాభవాని, కాఫ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నలుగురు బాలలను, వారితో భిక్షాటన చేస్తున్న ఒక తల్లిని అధికారులు గుర్తించారు. వీరిలో ఇద్దరు బాలలు మహారాష్ట్ర నుంచి మరొకరు విశాఖపట్నం నుంచి వలస వచ్చినట్టు గుర్తించారు. బాలలను, తల్లులను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు జె సంతోష కుమారి సమక్షంలో హాజరుపరిచారు. వారు ఈ యాచక వృత్తిలో ఉన్న తల్లులకు కౌన్సిలింగ్ అందించి మరల యాచక వృత్తికి పాల్పడవద్దని హెచ్చరించారు. అది పునరావృతం అయితే బాలల న్యాయ చట్టం సెక్షన్ 76(1) ప్రకారం చర్య తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించి వారి నుంచి లిఖిత పూర్వకంగా అంగీకార పత్రం తీసుకున్నారు. అలాగే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు పిల్లలను వారి తల్లులకు అప్పగించారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలలతో భిక్షాటన చేయిస్తే చట్టరీత్యా నేరమని అలాంటి వారికి జైలు శిక్షతప్పదని, బాలలతో భిక్షాటన చేయిస్తే ఆ వ్యక్తికి 5 ఏళ్ళ జైలు శిక్ష, రూ. లక్ష వరకూ జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. ఎవరైనా బాలలచే భిక్షాటన చేయించేందుకు ప్రయత్నించినా, అందుకు ఉపయోగించుకున్నా, బాలబాలికలు భిక్షాటన చేసేందుకు కారకులైన వారిపై బాలల న్యాయ చట్టం-2015, సెక్షన్ 76 (1) ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణించ బడుతుందన్నారు. ఎక్కడైనా బాలలతో భిక్షాటన చేయిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి దుర్గా రాణి, సోషల్ వర్కర్ చినబాబు, ఔట్రీచ్ వర్కర్ దుర్గా భవాని, క్రాఫ్ వర్కర్ లక్ష్మీ, ఆర్పీ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.


# అటవీ సంపదను దోచుకుంటున్నారు.. ఆదివాసీలను వదిలేశారు : ప్రొఫెసర్ హరగోపాల్




**హనుమకొండ, (రాజధాని వార్తలు):** భారతదేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని పౌర హక్కుల ఉద్యమ నేత, ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివాసీల చరిత్ర అంతా పోరాటమయం అని చెప్పారు. అడవులను కాపాడేందుకు వారు ఇప్పటికీ పోరాటాలు చేస్తూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. హనుమకొండలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఐక్యత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, ఆదివాసీ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్, ఆదివాసీ సంఘాల నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. ఆదివాసీల పట్ల పాలకులు వివక్ష చూపుతున్నారని అన్నారు. అభివృద్ధి కంటే అణచివేతనే కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి హామీలు ఇచ్చారే కానీ, పాలకులు ఏనాడూ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. అటవీ సంపదను దోచుకుపోతున్న వారే తప్ప, ఆదివాసీలకు భరోసా ఇచ్చే వారు లేకుండా పోతున్నారని చెప్పారు. ఖనిజ సంపదను తరలించుకుపోతున్నారే కానీ, అడవి బిడ్డల అభ్యున్నతిని విస్మరిస్తున్నారని హరగోపాల్ మండిపడ్డారు. పెట్టుబడిదారులకు పాలకులు కొమ్ముకాస్తున్నారని, ఆదివాసీలను అణచివేతకు గురిచేస్తున్నారని ఆగ్రహించారు. ఆదివాసీలందరూ ఎలాంటి స్వార్థం లేని వారని, అందుకే అడవులు అంతరించిపోకుండా కాపాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఆదివాసీలు అందరూ సంఘటితమై పాలకులను నిలదీయాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు.

# వైభవంగా కొరుపల్లి నేరేళ్ళమ్మ తీర్థోత్సవం

## - గరగ నృత్యాలు, శక్తి వేషాలు ఆకట్టుకున్న జాతర మహోత్సవం





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం కొరుపల్లి గ్రామదేవత శ్రీశ్రీశ్రీ నేరేళ్ళమ్మ తీర్థోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరుగాంచిన నేరేళ్ళమ్మ ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించగా, పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. గ్రామ పరిసర ప్రాంతాల ముత్తయిదువులు ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తిభావాన్ని చాటుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్శన క్యూ లైన్ల ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి 7 గంటలకు కరప సీతారామ కోలాట బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవ జాతర కార్యక్రమాలు శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు అట్టహాసంగా సాగాయి. కొరుపల్లి, రాయవరం ప్రాంతాల నుంచి వచ్చిన బ్యాండ్ మేళాలు, శక్తివేషాలు, గరగ నృత్యాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శక్తివేషధారులు ప్రదర్శించిన విన్యాసాలు, ప్రదర్శ నలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అమ్మవారి కటాక్షం కోరుతూ ప్రత్యేక మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# అబద్ధాలు, అసత్యాలు వండివారుస్తున్న వైసీపీ నేతలు : దేవినేని ఉమా



**అమరావతి, (రాజధాని వార్తలు):** తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రెస్ మీట్లు వదిలేసి ట్విట్టర్ బాట పట్టారంటూ వైసీపీ నేతలపై టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించి అబద్ధాలు, అసత్యాలు వండి వారుస్తున్నారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి ప్యాలెస్, ట్విట్టర్‌లో పిచ్చి ప్రేలాపనలు కట్టిపెట్టి మీడియా ముందుకు వచ్చి మాట్లాడాలంటూ వారికి ఆయన చురకలు అంటించారు. ఆదివారం రాజధాని అమరావతిలో దేవినేని ఉమా మాట్లాడుతూ.. గత ఐదేళ్లు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఐసీయులో పెట్టిందని వైసీపీపై నిప్పులు చెరిగారు. 23 నెలల్లో రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులతోపాటు 24 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా డబుల్ ఇంజన్ సర్కార్ కూటమి ప్రభుత్వం పరిగెడుతోందని పేర్కొన్నారు. ఏపీకి ప్రతిష్టాత్మక కంపెనీలు వస్తుంటే..వాస్తవాలు ఒప్పుకునే పరిస్థితిలో వైసీపీ లేదని వ్యంగ్యంగా అన్నారు. పోలవరం, ప్రజా రాజధాని అమరావతి పనులపై విషం చిమ్ముతున్నారంటూ వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. భోగాపురానికి ఎర్రబస్సు రాదన్నారు.. నేడు ఎయిర్ బస్సులు దిగబోతున్నాయని పేర్కొన్నారు. 8.8 కోట్ల మంది పేదల ఆకలిని అన్న క్యాంటీన్లు తీర్చాయని దేవినేని ఉమా గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వేల కిలోమీటర్లు రోడ్లు వేస్తుంటే.. ఐదేళ్లు రహదార్లపై గుంతలు పూడ్చలేని మీరు రోడ్లు గురించి మాట్లాడతారా? అంటూ వైసీపీ నేతలను మాజీ మంత్రి దేవినేని ఉమా సూటిగా ప్రశ్నించారు.

# జి.రాగంపేటలో "టీబి ముక్తి భారత్ అభియాన్"



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** జి రాగం పేట గ్రామంలో శనివారం "టీబీ ముక్తి భారత్ అభియాన్"లో భాగంగా టీబీ నిర్మూలన కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా 15 ఏళ్ళు నిండిన ప్రతీ ఒక్కరికి ఎక్సరే తీయడం ద్వారా ఊపిరి తిత్తులలో ఇన్ఫెక్షన్, క్షయ వ్యాధి నిర్ధారణ చేసేందుకు వీలుగా ఉండటంతో పాటు ముందుగానే టీబీ వ్యాధిని గుర్తించడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని పులిమేరు పిహెచ్సి వైద్యాధికారి డా.బి వై ఎస్ ఎం దీపిక తెలిపారు. ఆమె సమక్షంలో ప్రజలందరికీ టీబి వ్యాధిపై అవగాహన కల్పించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# క్వాంటమ్ టెక్నాలజీకి అమరావతి కేంద్రం : నారా లోకేశ్




**అమరావతి, (రాజధాని వార్తలు):** క్వాంటమ్ టెక్నాలజీకి అమరావతి కేంద్రమని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. యువ భారతీయులు అమరావతిలో క్వాంటమ్ టెక్నాలజీ నిర్మాణంలో భాగస్వామ్యం అవుతామని అంటున్నారని పేర్కొన్నారు. గుంటూరుకు చెందిన రిక్షాడ్రైవర్ కుమార్తె పల్లవి కాయాల క్వాంటమ్ రంగంలో ప్రతిభ కనబరుస్తోందని తెలిపారు. టెన్త్‌లో 600/600 మార్కులు సాధించిన పల్లవి ఇప్పుడు IIIT శిక్షణ పొందిన ఇంజినీర్ అని చెప్పుకొచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్టు పెట్టారు. ముంబై నుంచి అమరావతికి వచ్చిన గోపాల్ జోషి క్వాంటమ్ ఆపరేషన్స్‌లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రముఖ భారతీయ విద్యా సంస్థల్లో పరిశోధనలు చేసిన నాగలక్ష్మయ్య... అధునాతన ఆర్ఎఫ్ సిస్టమ్స్ అభివృద్ధి చేస్తున్నారని మంత్రి లోకేశ్ వివరించారు. నగరం పూర్తికాకముందే అమరావతికి శాస్త్రవేత్తలు, పరిశోధకులు ఆకర్షితులు అవుతున్నారని వెల్లడించారు. అమరావతిపై యువతలో పెరుగుతున్న నమ్మకం, ఆశయాలకు ఇది నిదర్శనమని ఉద్ఘాటించారు. భారత్‌లో ఎదుగుతున్న డీప్ టెక్ హబ్‌గా అమరావతిని ఎకనామిక్ టైమ్స్ గుర్తించిందని తెలిపారు. విద్యార్థులు, శాస్త్రవేత్తలు, స్టార్టప్‌లకు అమరావతి కొత్త అవకాశాల వేదిక అని వ్యాఖ్యానించారు. భారత భవిష్యత్తు టెక్నాలజీల రూపకల్పనలో ఏపీ యువత కీలక పాత్ర పోషించనుందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# విలువలతో కూడిన విద్య ప్రభుత్వ బడుల్లోనే సాధ్యం

## - బడి పిలుతోందిలో ఎంఎంవో జగన్మోహన్




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ బడుల్లో విలువలతో కూడిన విద్యాభ్యాసాన్ని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే అందిస్తున్నందున బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని విద్యాశాఖ ఏఎంఓ జగన్మోహన్ పిలుపునిచ్చారు. "ప్రభుత్వ బడి పిలుస్తుంది" ఎన్రోల్మెంట్ డ్రైవ్-2026-27 కార్యక్రమంలో భాగంగా శనివారం డివైఈవో ఈ ప్రభాకర్ శర్మ, సమగ్ర శిక్ష ఏఎంవో జగన్ మోహన్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు సి ఆర్ ఎం టి, విద్యార్థిని విద్యార్థులు శనివారం పెద్దాపురం మండలం చిన బ్రహ్మదేవం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న ఉచిత విద్య, ఇతర పథకాలపై గ్రామ పరిధిలోని తల్లిదండ్రులకు, ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. అలాగే పలువురు చిన్నారులను పాఠశాలలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టి వారికి అడ్మిషన్ పత్రాలను అందజేశారు.

# అన్నా క్యాంటీన్ల నిర్వహణలో పరిశుభ్రతను, నాణ్యతను పాటించండి

## - అతిథి దేవోభవ అంటూ ఆహారాన్ని చిరునవ్వుతో వడ్డించండి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా నిర్వహించాలని, ఆహార పదార్థాలలో నాణ్యతను పాటించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. శనివారం పాయకరావుపేటలో వున్న అన్నా క్యాంటీన్ ను పరిశీలించారు. అన్న క్యాంటీన్ అంతా కలియతిరిగి పరిశుభ్రతా చర్యలను గమనిస్తూ నిత్యం అన్నా క్యాంటీన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మౌలిక సదుపాయాలలో లోటుపాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమగు చర్యలను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆహారాన్ని భుజిస్తున్న వారితో మాట్లాడుతూ ఆహార నాణ్యతను, రుచిని అడిగి తెలుసుకున్నారు. అన్న క్యాంటీన్లలో ఆహారం కోసం వచ్చిన వారికి అతిథి దేవోభవ అంటూ చిరునవ్వుతో ఆహారాన్ని వడ్డించాలని, ఇంటిలో మనం భోజనం చేసేటప్పుడు, బంధువులకు ఆతిథ్యమిచ్చేటప్పుడు శుచి, శుభ్రత, రుచి, నాణ్యత పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటామో అలాగే అన్నా క్యాంటీన్లలో కూడా భోజనం చేసే వారి పట్ల అంతే జాగ్రత్తలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం వడ్డిస్తున్న ఆహారాన్ని పరిశీలించి ఆహారాన్ని రుచిగా తయారుచేసి, పరిశుభ్రమైన ప్లేట్లలో ఆహారాన్ని వడ్డించాలన్నారు. హారే రామ హారే కృష్ణ తెచ్చేస్తారు సార్ వీళ్ళే ఉండరు అనుకోండి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదల కోసం ఏర్పాటు చేసే ఈ అన్నా క్యాంటీన్లపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలని ఆహార సరఫరాలో లోటు లేకుండా నిర్వహించాలని, ఆహార నాణ్యతలో కూడా ప్రత్యేక శ్రద్ధను చేపట్టాలని నిర్వాహకులకు అలాగే అన్న క్యాంటీన్లను నిత్యం పర్యవేక్షిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్య చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# జలధార-జలహారతితో పెదభొట్ల చెరువుకి కొత్త జీవం

## - 105 ఎకరాల ఆయకట్టుకు.. పలు రైతు కుటుంబాలకు సాగునీటి భరోసా
## - చెరువు అభివృద్ధికి రూ 9.9 లక్షలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలధార – జలహారతి కార్యక్రమంలో భాగంగా సబ్బవరం మండలం మొగిలిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పెదభొట్ల చెరువు అభివృద్ధి పనులు విజయవంతంగా కొనసాగుతున్నాయి. చెరువుల పునరుద్ధరణ ద్వారా గ్రామీణ వ్యవసాయానికి బలాన్నిచ్చే లక్ష్యంతో చేపట్టిన ఈ పనులు రైతుల్లో నూతన ఆశలు నింపుతున్నాయి. 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్దభొట్ల చెరువుకు ప్రభుత్వం రూ. 9.9 లక్షలు పూడికతీత, చెరువు గర్భం శుభ్రపరిచే పనులు 450 మీటర్స్ పొడవున్న గట్టు బలోపేతం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఈ చెరువు కింద సుమారు 105 ఎకరాల ఆయకట్టు భూమిలకు సాగునీరు అందుతోంది. ఈచెరువు నీటి ఆధారంగా గ్రామ రైతులు వరి, రాగి, కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. చెరువు పునరుద్ధరణతో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో రైతులకు సాగునీటి సమస్యలు తగ్గి, పంటల ఉత్పత్తి మెరుగు పడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనుల ద్వారా గ్రామంలో రోజువారీగా సుమారు 214 మంది ఉపాధి వేతనార్థులకు ఇది ముఖ్యంగా గ్రామీణ నిరుద్యోగులకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఈ కార్యక్రమం ఎంతో కీలక పాత్ర పోషిస్తోంది. పెదబాట్ల చెరువు అభివృద్ధితో సుమారు 285 రైతు కుటుంబాలు ప్రత్యక్షంగా ప్రయోజనం పొందుతున్నాయి. చెరువుల పునరుద్ధరణతో వ్యవసాయం బలోపేతం కావడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తున్నట్లు అభిప్రాయపడుతున్నారు. దీన్ని నమ్ముకొని




దాదాపు సుమారు 285 రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వరి, మొక్కజొన్న, చోళ్లు, మినుములు కూరగాయలు వంటి పంటలను ఈ చెరువు నీటితోనే పండిస్తున్నాము. గతంలో నీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పుడు ప్రభుత్వం చేపట్టిన పనులతో ఈ చెరువుకు కొత్త జీవం వచ్చింది.చెరువు బాగుపడితే మా వ్యవసాయం బాగుపడుతుంది. మా గ్రామ రైతుల తరఫున ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. చెరువు నిండితే మాకు సాగునీటి సమస్య ఉండదు. వరితో పాటు ఇతర పంటలు కూడా బాగా పండించుకునే అవకాశం ఉంటుంది. అలాగే గ్రామంలో తాగునీటి అవసరాలకు కూడా ఈ చెరువు ఎంతో దోహద పడుతుందని. ప్రస్తుతం ప్రభుత్వం జలధార – జలహారతి కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేయడం చాలా సంతోషంగా ఉంది. ఈ పనుల వల్ల భవిష్యత్తులో నీటి ఇబ్బందులు కూడా తగ్గుతాయని ఆశిస్తున్నాం అని గ్రామస్తులు తెలిపారు.

# రోడ్లపై నమాజ్‌లు వద్దు, ముస్లింలు జనాభా నియంత్రించుకోవాలి..యోగి ఆదిత్యనాథ్

**లఖ్‌నవూ:** రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేని లఖ్‌నవూలో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్ర మంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రిం చుకోవాలి' అని అన్నారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోడ్లపై నమాజ్‌లు చేయరా అని తరచూ కొందరు నన్ను అడుగుతుంటారు. అలాంటివి ఇక్కడుండవని చెబుతుంటాను. కావాలంటే వెళ్లి చూసుకోమంటాను. రోడ్లున్నవి ప్రజా రవాణా కోసం. ఎవరైనా రోడ్ల కూడళ్ల వద్దకు వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించవచ్చా? ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు?. మరికొందరు అడుగుతుం టారు. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అంటారు. దానికి మా సమాధానం ఒక్కటే. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో జాగా లేకుంటే దానికి తగ్గట్టుగా జనాభా ఉండేలా చూసుకోండి. జనాభాను పెంచుకోకండి. చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఇటీవల పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా యోగి ఆదిత్యనాథ్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై నమాజ్‌లను మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వం అనుమతించడాన్ని తప్పుపట్టారు. ఆయన వ్యాఖ్యలను టీఎంసీ తోసిపుచ్చింది. మైనారిటీలను యోగి ఆదిత్యనాథ్ బెదిరిస్తున్నారంటూ వ్యాఖ్యానించింది.

# పాయకరావుపేటలో ఘనంగా 'సాసా' కార్యక్రమం

## - ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం పాయకరావుపేట గ్రామ పంచాయతీ మరియు మండల పరిధిలో నిర్వహించిన 'సాసా' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పాల్గొని పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పలు కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని పిలుపునిస్తూ భారీ ర్యాలీని నిర్వహించి, అందరిచేత 'సాసా' ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ "సింగిల్ యూజ్" (ఒక్కసారి మాత్రమే వాడే) ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్లాస్టిక్ ప్లేట్లు మరియు గ్లాసుల స్థానంలో స్టీల్ ప్లేట్లు, గ్లాసులను ఉపయోగించేలా ప్రోత్సహించడానికి 'బర్తన్ బ్యాంక్' కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో ముందుండే గ్రీన్ అంబాసిడర్లకు నిత్యావసర వస్తువులను కలెక్టర్ పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్




సమక్షంలో పాయకరావుపేట రూర్బన్ గ్రామ పంచాయతీ మరియు స్వయం సహాయక సంఘం గ్రూపుల మధ్య ఘన వ్యర్థాల సంపద సేకరణ కేంద్రం నిర్వహణ మరియు పర్యవేక్షణకు సంబంధించిన ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

## - జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్య నారాయణరావు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్ష ణకు కట్టుబడి ఉండాలని సిబ్బంది అందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయాలు మరియు ప్రజా ప్రదేశాలలో పరిశుభ్రతను కాపాడుకోవడం ఎంత ముఖ్యమో డిఆర్ఓ వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

# గ్రీన్ ఫీల్డ్ పోర్టుల పనులు వేగవంతం చేయాలి : మంత్రి జనార్ధన్ రెడ్డి

**అమరావతి, (రాజధాని వార్తలు):** గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల పనులు వేగవంతం చేయాలని ఏపీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంలో సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, పిషింగ్ హార్బర్ల పురోగతిపై మంత్రి సోమవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. రాష్ట్రంలోని మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేసి.. అందుబాటులోకి తీసుకు రావాలని దిశానిర్దేశం చేశారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు.

**మూలపేట పునరావాస కల్పనపై చర్చ..**

పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణంలో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కరిస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల పనులు మరింత వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు. మూలపేట పోర్టుకు సంబంధించి ప్రధానంగా ఉప్పు భూముల సమస్య, రోడ్డు, రైల్వే, ఆర్ అండ్ ఆర్ వంటి మౌలిక సదుపాయాల కల్పన సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. మూలపేట గ్రామానికి పునరావాస కల్పనను వేగవంతం చేయడం ద్వారా డ్రెడ్జింగ్‌ను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, ఈ ఏడాది ఆఖరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.



**డ్రెడ్జింగ్ పనులు మరింత వేగవంతం చేయాలి..**

మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ పనులు మరింత వేగవంతం చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. మచిలీపట్నం పోర్టుకు రైల్వే అనుసంధానం, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనను వేగవం తం చేయాలని దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా తీసుకుని గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను చేపట్టిన క్రమంలో వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు సహకరించాలని కోరారు. రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టులో డ్రెడ్జింగ్, పునరావాసం వంటి సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని మార్గనిర్దేశం చేశారు. మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులతో పాటు, ఫేజ్1 ఫిషింగ్ హార్బర్‌ల పనులు కూడా సకాలంలో పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699


RAJADHANIVARTALU.COM
9440662699


# స్వచ్ఛాంధ్ర సాధన, నీటి సంరక్షణే మన లక్ష్యం

## - వేసవి తీవ్రతను తట్టుకునేలా వేడిని జయించండి "నీటి సంరక్షణ" పై ప్రత్యేక అవగాహన : అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిలు పునిచ్చిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత వేసవి వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు మరియు గరిష్ట ప్రభావాన్ని సాధించేందుకు కాలానుగుణ మార్పులను అనుసరిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన "వేడిని జయించండి" మరియు "నీటి సంరక్షణ" అంశాలపై జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ?ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ స్వయంగా చీపురు పట్టి, కార్యాలయ ఆవరణలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఎస్పీ పాటు ఇతర అధికారులు, సిబ్బంది అందరూ కలిసి ఆవరణలోని వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని తొలగించి ఉత్సాహంగా "శ్రమదానం" నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సామాజిక బాధ్యత – కాలానుగుణ అవగాహన పోలీసు యంత్రాంగం కేవలం శాంతిభద్రతల పరిరక్షణలోనే కాకుండా, సామాజిక బాధ్యతలోనూ ముందుండాలని, మన కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమైన అంశాలపై సిబ్బందికి, ప్రజలకు పిలుపునిచ్చారు.

**పరిసరాల పరిశుభ్రత...**

స్వచ్ఛత అనేది ఒక్క రోజుతో ముగిసేది కాదని, మన దైనందిన జీవితంలో భాగంగా మారాలని ఆకాంక్షించారు. వేడిని జయించండి వేసవి తీవ్రత మరియు కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. విధులు నిర్వహించే సమయంలో తగినంత నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

**నీటి సంరక్షణ కార్యకలాపాలు..**

ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న ఈ కాలంలో నీటి ప్రతి చుక్కా విలువైనదే. కార్యాలయాల్లో మరియు ఇళ్లల్లో నీటి వృధాను అరికట్టి, నీటి సంరక్షణను ఒక బాధ్యతగా చేపట్టాలి. కార్యాలయ పరిసరాలు ఎంత పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంటే పని చేసే సిబ్బందికి అంతటి ఉత్సాహం, ఆరోగ్యం లభిస్తాయి. జిల్లాను స్వచ్ఛంగా తీర్చిదిద్దడంలో మరియు వేసవి వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రకృతి వనరులను కాపాడుకోవడంలో ప్రతి పోలీస్ అధికారి భాగస్వాములు కావాలి అని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు జీ.ఆర్. ఆర్.మోహన్, బి.మోహనరావు, ఇన్స్పెక్టర్లు బాల సూర్యారావు, లక్ష్మి, ధనుంజయరావు, సేనం రమేష్, పిల్లా రమేష్, రామకృష్ణారావు, ఎస్సైలు రమణయ్య, హరినాథ్, అంజిబాబు మరియు జిల్లా పోలీస్ కార్యాలయానికి చెందిన ఇతర విభాగాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బుల్లెట్ వేగంతో బుల్లెట్ మోటార్ సైకిల్ ప్రాజెక్టు

## - సీఎం చంద్రబాబుతో రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ ప్రతినిధుల భేటీ
## - బుల్లెట్ వాహన మోడళ్లను పరిశీలించిన సీఎం









**అమరావతి, (రాజధాని వార్తలు):** బుల్లెట్ వేగంతో రాష్ట్రంలో బుల్లెట్ మోటార్ సైకిల్ ప్రాజెక్టు ఏర్పాటు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి సమీపంలో ఏర్పాటు చేయనున్న రాయల్ ఎన్ ఫీల్డ్ ప్రాజెక్టును 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని దీనికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తుందని సీఎం వెల్లడించారు. రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించటంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో బుల్లెట్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అత్యాధునిక తయారీ యూనిట్‌తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మిస్తామని అన్నారు. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 9 లక్షల మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేయనున్నట్టు రాయల్ ఎన్ ఫీల్డ్ సీఈఓ గోవిందరాజన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. త్వరలో ఫ్లైయింగ్ ఫ్లీ సీ6 పేరిట ఎలక్ట్రిక్ వేరియంట్ మోడల్‌ను కూడా తీసుకురానున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ఆంధ్రప్రదేశ్‌లో రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పాదనకు సంబంధించి చేపట్టిన వివిధ ప్రాజెక్టులపై రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులకు వివరించారు. సౌర, పవన విద్యుత్ తో పాటు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ ప్రాజెక్టుల గురించి వారికి తెలియచేశారు. అనంతరం రాయల్ ఎన్ ఫీల్డ్ ప్రతినిధులు సీఎంకు బుల్లెట్ 350 మినియేచర్ మోడల్‌ను ముఖ్యమంత్రికి అందించారు.

ఈ సందర్భంగా బుల్లెట్ 350 మోటార్ సైకిళ్లకు సంబంధించిన మోడళ్లను సీఎం పరిశీలించారు. హెల్మెట్ ధరించి సీఎం బుల్లెట్ ఎక్కారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan